
**ఈవారం కథ**



- విపినమూర్తి

# సంధ్య



'రామనాధం- రామనాధం'

బాంక్ ప్యూన్ పిలుస్తున్నాడు. మండిపోయింది. "వేలెడంత లేదు. అరవై అయిదేళ్ళ మనిషిని. రిటైరయిన గవర్నమెంట్ గెజిటెడ్ ఆఫీసర్ని. ప్రతివాడూ వణికిపోయేవాడు. అలాంటి నన్ను పట్టుకుని- రామనాధము రామినాధము- అంటాడా?"

వాయించేద్దామని లేచాను. అదృష్టవంతుడు. దొరకలేదు. బల్లమీదనున్న నా సేవింగ్స్ అకౌంట్ పాస్ బుక్ తీసుకున్నాను. మెల్లగా వచ్చి సోఫాలో కూర్చున్నాను. ఏం మనుషులో- ఏం లోకమో- మంచి చెడ్డా లేదు. పెన్ను పట్టుకురారు. నా మానాన నేను కూర్చుంటే వచ్చి పెన్ను కావాలని సతాయింపు. తీరా యిస్తే, మళ్ళీ పత్తా వుండరు. ఎవరిని అడిగాడో వాడికి గుర్తుండదు.

9-6-95 ఆంధ్రజ్యోతి సచిత్ర వారపత్రిక

జీప్ తీసి, పాస్‌బుక్ పెట్టానోలేదో మళ్ళీ చూసాను.

పక్కనున్న వాడు నావైపుచూసి–వెధవ నవ్వు. ముసిలాడినవు– పాస్‌బుక్‌ని ప్రాణం కన్నా ఎక్కువగా– నా కన్నా పదిసార్లు ఎక్కువ చూసుకుంటావు" అనుకున్నాను. చుంచుమొహంగాడు–

"అరగంటయింది టోకెన్ యిచ్చి, మరో అర గంటకిగాని– ఆ కాషియర్ మనని పిలవడు–" అన్నాను నవ్వు తెచ్చిపెట్టుకుని.

చుంచుమొహం నవ్వలేదు.

మొహం కోపంగా పక్కకి తిప్పకున్నాడు. నా టోకెన్ నంబర్ వెలిగింది. కౌంటర్ దగ్గరకి వెళ్ళి డబ్బు తీసుకుని, అక్కడే లెక్కపెట్టుకుంటున్నాను. వెనకనున్నవాడు– "తాతగారూ–పక్కన నిలబడి లెక్కపెట్టుకోండి– " అన్నాడు.

"అలాగే నాయనా– తప్పకుండా నీ సలహా పాటిస్తాను. తీరా ఓ వంద తేడా వస్తుంది. లోపలున్నాయన– కౌంటర్ విడిచిపెడితే–నాకు సంబంధం లేదు పొమ్మంటాడు. నువ్విస్తావా–? తాతగారుట–తాతగారు–నువ్వు నాకు తాతలా ఉన్నావ్!" అన్నాను.

కిమ్మన్నాస్తి. నోరు ఎత్తలేదు.

గబగబ అంగలు వేసుకుంటూ– బాంక్ గుమ్మం దాటుతున్నాను. గేటు దగ్గర తుపాకి పట్టుకుని సెంట్రీ నిలబడివున్నాడు.

ఆ పక్కనుంచి ఎవరో–'రామనాథంగారూ–రామనాథంగారూ' అంటూ పెద్దగా అరుస్తున్నాడు. ఆగాను. వెనక్కి తిరిగాను. తెలిసిన మోహం ఏదీ కనిపించలేదు.

గేటు బయటనే ఉన్నాడు నా పేరు పిలుస్తున్న మనిషి.

ఉంటాయి–దెబ్బైకి పైనే ఉంటాయి. కాకీ హాఫ్ పాంట్– తెల్లటి చొక్కా. ముందుకు పొడుచుకొచ్చినట్టున్న ముక్కు. చప్పి దవడలు. తెల్లటి గుబురు మీసాలు. పెద్దపెద్ద చెవులు. తలమీద నాకన్న గుప్పెడు ఎక్కువే ఉంటుంది జుట్టు. కురచగా ఉన్నాడు.

"నేనే రామనాథాన్ని– ఏంకావాలి?"

"తమరా– బాబూ రామనాథంగారూ– మీదీ, నాదీ పాస్‌బుక్‌లు తారుమారు అయాయి. నా పాస్ బుక్ మీ దగ్గరుంది–" అంటూ తన చేతిలోని పాస్‌బుక్ నాకు యిచ్చాడు.

ముందుగా దాన్ని తనిఖీ చేసుకుని– ఆ తర్వాత దానిని జీప్‌లో ఉంచాను. జీప్‌లో వున్న అతని పుస్తకం తీసి మరోసారి చూసుకుని అతనికియిస్తున్నాను. ఇంతలో ఒక్కసారిగా అతను కళ్ళు మూసుకుని ఉన్నపాటున పడిపోయాడు. నలుగురు మూగారు. నేను పట్టుకుని అతన్ని నెమ్మదిగా బల్ల మీద కూర్చోబెట్టాను. దానిమీద ఒరిగిపోయాడు.

**అబద్ధం**

పోలీసు అడిగాడు పోలయ్యను.

"నీవు ఆ జేబు దొంగతనం చేస్తుండగా చూసి వెంకటాచలం పట్టుకున్నాడట నిజమేనా?"

"అంతా అబద్ధం... అసలు చూడనే లేదు... అనుమానం మీద అరెస్ట్ చేశారు. కాదంటే చూడండి. ఆయన నన్ను లాకప్‌లోనికి తోస్తుండగా ఆయన జేబులో పర్సు కొట్టేశాను. ఈ సంగతి ఆయనకు తెలీదు"

— కె.వి.మధుసూదనరావు

ఎవరో నీళ్ళు తీసుకొచ్చారు. మొహం మీద చిలకరించారు. నోట్లో పోసారు. కొద్దిగా అంగుట్లోకి దిగాయి. మనిషి తెప్పరిల్లాడు.

అందరూ– ఏటయిందేటయింది– అంటున్నారు.

"ముసిలితనం. ఎండలు. ఈ మధ్య కళ్ళు చీకట్లు కమ్ముతున్నాయి బాబూగారూ–" అన్నాడు కూర్చుంటూ.

"కూర్చో–కూర్చో–" అన్నాను.

"ఫరవాలేదు బాబుగారూ–" అంటూ లేచి నించున్నాడు. నేను జీప్‌లోంచి పాస్‌బుక్ తీసి– మళ్ళీ చూసుకుని– అతనికి యిస్తున్నాను.

"నీ పని అయిందా–" అన్నాను.

"ఏంటవుతుంది బాబుగారూ– మా కుర్రాడు మద్రాసులో ఉన్నాడు. ప్రతి నెలా నా అకౌంట్‌కి ఎమ్.టీ. పంపుతారు. నీళ్ళ చుట్టూ తిరిగితే– యింకా రాలేదంటారు–" అన్నాడు.

ఇద్దరం నడుస్తున్నాం. మద్రాసు అనగానే ఏకవచనం చెయ్యబుద్ధవలేదు.

"డీడీ పంపమనండి– యిలా తిరగనక్కర లేదు–"

"ధరలు ఎలా వున్నాయి బాబుగారూ– రిజిస్ట్రీలో పంపాలంటే మాటలా– మామూలు పోస్టయితే వస్తుందని లేదు–" అన్నాడు.

మనిషి నీరసంగా కనిపిస్తున్నాడు– అలా వదిలేస్తే– పడిపోయేలా ఉన్నాడు. మనసు ఒప్పలేదు.

"కాఫీ తాగుదాం పదండి– మనం ఎంత కూడబెట్టినా మింగి జల్సా చేసేది పిల్లలేగదా–" అన్నాను.

అన్నానేగాని, లోలోపల బెంగ. పిలిచింది నేనే గనక డబ్బులు నేనే యివ్వాలి. మనిషి నాలకం చూస్తే– పైసాకి టికానా లేనాడిలా కనిపిస్తున్నాడు. అయినా– ఎంతవుతుంది! నాలుగు రూపాయలు. పెద్ద ఖర్చు కాదు. జానకి ఊరుకోదు. ప్రతిపైసా లెక్క అడుగుతుంది.

రక్షించాడు–వద్దన్నాడు. కాలి చెప్ప తెగిపోయింది. ఒంటికాలిమీద నిలబడి రెండవ కాలి నుంచి తప్పించాడు. హవాయి చెప్పలు. స్ట్రాప్ తెగిపోయింది. అప్పటికే– పిన్నీసు పెట్టాడు. అది ఊడింది. మళ్ళీ పెడుతున్నాడు. కాలుకింద పెట్టాలంటే– విశాఖపట్నం ఎండలు మజాకా చూపిస్తాయి.

మాట మాటకీ 'బాబుగారు'– అంటున్నాడు. మంచీ, మర్యాదా, పెద్దా చిన్నా తెలిసినవాడు!

డాబా గార్డెన్స్‌లోనే ఉంటున్నాడుట. తనే రిక్షా వాడిని పిలిచాడు. సంకోచం. చివరకి యిద్దరం ఎక్కాం. కబుర్లలో పడ్డాం. వాగుడుకాయ. తెగ వాగ్నుతున్నాడు.

నలభై ఏళ్ళకు పైగా ఫ్యాక్టరీలలో పనిచేసాడుట. చౌకీదారు. ఒక్కడే కొడుకుట. తెలివైన వాడుట. స్కాలర్ షిప్‌ల మీద డిగ్రీ చదివాడుట. ఏదో ఉద్యోగం దొరికిందిట– గోపాలపట్నం దగ్గర ఒక ఫ్యాక్టరీలో– అక్కడే ఒక అమ్మాయి పరిచయమయిందిట. పెళ్ళాడాడుట. మద్రాసులో పెద్ద ఉద్యోగం వచ్చిందిట– పెళ్ళాన్ని ఉద్యోగం మాని పించి తీసుకువెళ్ళాడుట. ఈ లోగా యితగాడు రిటైరయాడుట. ఇతగాడికి వచ్చిన ఋణమూ, పణమూ తీసుకువెళ్ళి మద్రాసులో యిళ్ళ స్థలం కొన్నాడుట. ప్రతినెలా డబ్బులు పంపుతానన్నాడట. కొన్నాళ్ళు–పాపం– పంపాడట. "ఇబ్బందుల్లో ఉన్నాను– అనుకున్నవేవీ అవటం లేదు. మీ కోడలికి పని సరయినదింకా కుదరలేదు–సర్దుకోండి–" అని రాస్తుంటాడుట. రెండు నెలలనుంచి ఉత్తరం లేదట. డబ్బులూ లేవుట.

చౌకీదారనగానే కాస్త చికాకు అనిపించింది. బ్రాహ్మణ.. పైగా మా శాఖే! బాబుగారూ– అంటూ మర్యాదగా మాట్లాడుతున్నాడు.

"తల్లిదండ్రులని బాధపెట్టిన వెధవకి పుట్టగతులుండవు–" అన్నాను.

"అమ్మమ్మ. అంతమాటనకండి బాబుగారూ. తమబోటి వాళ్ళు ఒకమాటంటే ఊరికెనేపోదు–" అంటూ ప్రాధేయపడ్డాడు.

"ఎక్కడ పనిచేస్తున్నాడు మీ వాడు–?"

"అదేదో– ఎలక్ట్రానిక్స్ కంపెనీ బాబుగారూ–"

"మా వాడూ మద్రాసే– వెళ్ళి కలియమంటాను–" అన్నాను.

"తప్పకుండా వెళ్ళమనండి బాబుగారూ–" అంటూ ఆగి "నా పరిస్థితి తెలియ జెప్పుదామనుకుంటున్నారా?"

"తప్పేముందయ్యా– తండ్రికి కొడుకు చెయ్యాలి. అది ధర్మం"

"మరొకరు చెప్పాల్సిన మాటకాదు బాబుగారూ–"

"అలా అనుకోబట్టే యింతవరకూ వచ్చింది. పిగ్గుగానూ ఉంటుంది– బుద్ధీ వస్తుంది–" అన్నాను.

కంగారుపడిపోయాడు. వద్దు వద్దన్నాడు. రిక్షా ఒక పెద్ద యింటిముందు ఆగింది. పక్కనేవున్న సందులోంచి లోపలికి వెళ్ళాడు. గుండెల్లో రాయి

పడింది అనుకున్నంతా అయింది. రిక్షాఖర్చులు నా చేత పెట్టిస్తాడన్నమాట. పాపం- చౌకీదారు.

అతనివ్వటం ఏం న్యాయం? ఆఫీసర్ని-నేనివ్వాలి. యివ్వొచ్చు కానీ- జానకి మొహం గుర్తొస్తోంది.

మీమాంసలో ఉండగానే అతనే లోపలినుంచి డబ్బులుతెచ్చి రిక్షావాడిని పంపేసాడు. 'మీరు నాకు అంత ఉపకారం చేశారు. అలా వెళ్ళిపోవ టానికి వీలులేదు. ఇంట్లోకి రావల్సిందే' అంటూ పట్టుకున్నాడు.

సన్నగా ఉంది సందు. మురుగుకాలవ పక్కనే ఉంది. ముందున్న మేడ ఒక ప్లీడరు గారిదిట. వెనకనే రెండు గదులు పట్టున ఉంది యిల్లు. ముందున చక్కగా తులసి కోట. పక్కన మయ్యి.

ముసిలాడి భార్య పార్వతీదేవిలా ఉంది. పచ్చని దబ్బపండు ఛాయ. చక్కగా మొహం మీద కాస్తంత బొట్టు. ఇల్లంతా శుభ్రంగా అమర్చి ఉంచింది. నిమ్మకాయ పిండి నీళ్ళు యిచ్చింది. ఎండబడి వున్నామేమో తెరిపిన బడ్డాము.

భర్తని పడిపోతుంటే, పట్టుకుని తీసుకుని వచ్చి నందుకు అగ్గగ్గలాడిపోయింది.

"దానికేముందమ్మా- ఈ రోజు నీ మొగుడు కలా అయింది. రేపు నేను- ఏం చేస్తాం?" అన్నాడు. ఆ మాట, యీమాటా అయాక ముసి లావిడ అంది.

"మూడు మాసాల నుంచి ఉత్తరం ముక్కలేదు. మా వాడి దగ్గర్నుంచి. కోడలైనా రాయాలి. అదీ రాయటం లేదు. పిల్లలూ, వాళ్ళూ ఎలా ఉన్నారో నని ప్రాణం కొట్టుకుపోతోంది. మీ అబ్బాయికి రాసి- ఎలా ఉన్నారో కనుక్కోమనండి-"

ముసలావిడ గడుసుపిండమే- ఎలాగోలా కొడుకు పిలక పట్టుకోవాలను కుంటోంది. చవ- అయుండదు. రాయంటి బిడ్డా వెన్నంటి తల్లీ అంటారు.

అడ్రను రాసుకున్నాను. వాళ్ళు పేపర్లతో పంచీలు చేస్తుంటారు కాబోలు. పేపర్లూ-సం చులూ- జిగురూ- మొదలైనవి ఓ వారగా పేర్చి ఉన్నాయి.

అక్కడనుంచి బయటపడ్డాను.

మనసు మండిపోతోంది. ఎండమాడిపోతోంది. పైవాడికి బుద్ధి చెప్పమని రాస్తే- వాడికి వచ్చినా, రాకున్నా- వీడికి వస్తుంది.

ఇంటికి చేరాను.

జానకి పట్టుకుంది. జేబులోంచి డబ్బులు తీసి యిచ్చాను. పాస్‌బుక్ యిచ్చాను. అన్నీ చూసు కున్నా, వదల్లేదు. ఎందుకు ఆలశ్యమయిందో చెప్పాలట.

నాకేం భయం? చెప్పాను. రామనాధం కథంతా చెప్పాను. ఆ పుణ్య దంపతులను ఆ కొడుకు ఎలా రాచిరంపాన పెడుతున్నాడో చెప్పాను. రాయి కైనా మనసు కరిగేలా చెప్పాను

జానకి రాయి కాదు, పాషాణం. కరగలేదు. పైగా మొదలెట్టింది-"మీకు మతిలేదు. మనుషుల్ని చూసి చేరదియ్యాలి. లేనిపోని వన్నీ నెత్తిన వేసు కుంటారు. మీ నాన్నగారూ యిలాగే చేసి చేతిలో చిప్ప యిచ్చి మిమ్మల్ని వదిలారు. పేరు ఆయనకి మిగిలింది. ఈడవలేక నేను చచ్చాను-" అంది.

నేను మాటకి మాట అంటించగలను.

కాని నా మనసు మరో దానిమీద లగ్నమయి వుంది.

ఘాటుగా రాసాను. దెబ్బకి దెయ్యం వదులు తుంది. ఒకటికి రెండు ముక్కలు చేర్చాను. 'తండ్రుల్నిలా వీధిలో నిలబెట్టి, పెళ్ళాల్ని నేసు కుని కొడుకులు అలా కులకడం ఏం న్యాయమో కనుక్కో" అంటూ రాసాను మా రవిగాడికి.

** ** ** **

చౌకీదారు రామనాథం అప్పుడప్పుడు కనిపిస్తూనే వున్నాడు. కూరల బజారులో కనిపిస్తే కబుర్లూ, బజారూ కలిపి సాగిపోయేవి. తన కొడుకు ఏవో కుంటిసాకులు చెపుతూ ఆ మధ్య ఉత్తరం రాసా డట. ఏ రోజూ నా కొడుకు సంగతి అతను ఎత్తలేదు. నేను చెప్పలేదు. ఆ రోజూ యధాలాపం గానే ఇంటికి రమ్మన్నాను.

రమ్మంటానేగాని, బెంగగా వుంటుంది. మను షుల్ని చూసి కాఫీలు ఇవ్వాలని జానక్కి ఇన్నేళ్ళూ నేర్పాను. ఇవ్వడేం చేస్తుందో అని బెంగ.

"చాలాసార్లు మీ మాట తీసేసాను బాబుగారూ - పదండి - అమ్మగారి దర్శనం చేసుకుంటాను -" అన్నాడు. చచ్చాంరా - అనుకున్నాను. ఇద్దరం ఇంటికి చేరాం!

రామనాథం నాలకం చూడగానే జానకి మొఖం అదోలా అయింది. హాల్లో కూర్చున్నాం. రామ నాథం గ్రహించాడేమో - ముళ్ళ మీద కూర్చున్నట్టు సోఫాలో కూర్చున్నాడు.

"ప్రేమనిచ్చిన ప్రేమ వచ్చును - అన్నాడు గుర జాడ అప్పారావు. నీ కొడుకులాంటివాడు ఆయనకి తారసపడలేదేమో -" అన్నాను. ఆ మాట మూడు రోజుల నుంచి మనసులో వుంది. ముసిలాడికి

గురజాడ అప్పారావేం తెలుస్తాడు - నా మొహం!

"అన్నన్న - అంతమాటనకండి బాబుగారూ - రవిగాంచని చోట కవిగాంచునన్నారు. ఆ మహాను భావుడి మాట తీరుపోదు-" అన్నాడు.

నేను కాస్త ఆశ్చర్యపోయాను - పైకి కనబడనీ యకుండా "ఎలా సమర్థిస్తావోయ్ - నీ కొడుకు విషయంలో - ? కొంపదీసి - నీ కొడుకు మీద నీకు ప్రేమలేదంటావా?"

"ఏమో బాబుగారూ - మనం చూపించేదే మన పిల్లలు చూపిస్తారు"

"అంటే-?"

"ఏముంది బాబుగారూ - పిల్లలకి ఎన్నెన్ని ఆంక్షలు పెట్టాం? చదువుకో చదువుకో - అని తినేసాం! దుస్సావాసాలు చేయొద్దురా అన్నాం. ఆ పిల్ల నేపు చూడొద్దూ - రాజకీయాలు వద్దూ - అలాంటి పుస్తకాలు చదవొద్దూ - ఎన్నిమార్లు ఎన్ని ఆంక్షలు పెట్టాం? చెప్పి ఊరుకున్నామా? వినకపోతే వీలునిబట్టి గోడకుర్చీలు వేయించాం - కాస్త పెద్ద వాళ్ళయితే - సత్యాగ్రహాలు చేసాం - సాధించాం - బాబుగారూ! ఇదంతా ప్రేమే... సందేహం లేదు. తల్లిదండ్రులు ఇవ్వాల్సిన శిక్షణే మరి! అయితే - ఆరోజున వాళ్ళకేం అనిపించివుంటుంది? మనం రాక్షసులమనిపించి వుంటుంది. మనకి ప్రేమ లేదనిపించి వుంటుంది. వాళ్ళ ప్రేమని వాడుకుం టున్నామనిపించి వుంటుంది-"

నాకా ముసిలాడి మాటలు బొత్తిగా నచ్చలేదు. మనం మనం అనడం నచ్చలేదు. తన కొడుకుని తను అన్నాడో లేదోగాని - అంతకన్నా ఎక్కువ అన్నాం నేనూ, జానకీ - మా రవిని! మా కన్నా తక్కువ వాడని తోస్తే "అలాంటి వాళ్ళతో స్నేహం చేస్తే కాళ్ళు విరగ్గొడతాం" అన్నాము. కొట్టాం. మనుషులని ఎవరిని ఎంత దూరంగా వుంచాలో రంగరించిపోసాం? ఈ రోజు మేం




●ధరకు తగ్గ ఫలితం●

సహోద్యోగిని సరోజిని విసుక్కోవడంచూసి కామేశ్వరి అడిగింది. "ఏమిటే ఆ కేలిక్యులేటర్‌తో కుస్తీ పడుతున్నావ్?"

"మరి చూడవే-ఆరును నాలుగుచేత హెచ్చ వేస్తే ఆన్సర్ 24 కదా! ఇది 12గా చూపిస్తోంది" అంది సరోజ.

"ఎక్కడ కొన్నావే దాన్ని?"

"మా చుట్టమొకడు మద్రాసులో వంద రూపా యిలకు కొని తెస్తే, అతని దగ్గర్నుంచి యాభై రూపాయిలకు నేకొన్నానే."

"అందుకేనేమో ఆన్సర్‌లో సగం చూపిస్తున్న ట్టుంది."

జి.వి.జి.

నేర్పిన లెక్కలతోనే – మా రవి – మమ్మల్నిలా ఎడపెడుతున్నాడా?

మనసంతా ఆలోచనలు. వుందు మీద కారం రాసినట్లుంది. కోపం తన్నుకొచ్చింది – వ్యంగ్యంగా అన్నాను – "మనం చిన్నవుడు కొట్టాం గనక – వాళ్ళూ మనని చావగొట్టాలంటావా రామనాథం?"

ఆ మనిషికి నా వ్యంగ్యం అందలేదో – అందినా పట్టించుకోలేదో – నవ్వుతూనే అన్నాడు – "వాళ్ళింకా ఆ పని చేయడం లేదు బాబుగారూ – మన మీద వాళ్ళే నయం –"

"తెలిసీ తెలీని పిల్లలకి తెలియజెప్పడమూ తప్పే – మందలించడమూ తప్పే – సృష్టిలో వున్న పద్ధతే తప్పు –" అన్నాను.

అతను కొంచెం కంగారుగా – "అబ్బబ్బే – నా మాట మీరు సరిగ్గా బోధపరుచుకోలేదు బాబుగారూ – అజ్ఞానంలో వున్నారని మనం శిక్షించాం – అలాగే మనం అజ్ఞానంలో వున్నామని వాళ్ళు అనుకుంటే – అనుకోవచ్చు'గదా–"

"మనది అజ్ఞానమేంటయ్యా మగడా –"అన్నాను.

అతను నన్ను శాంతబరుస్తున్నట్టు నవ్వి – "మావాడి సంగతే చూడండి బాబుగారూ – నేను మా ఊరిలో వుండగా అక్షరం ముక్కరాదు. వాడు –? విశాఖపట్నం లాంటి ఊళ్ళో పుట్టాడు. పెద్ద చదువులు చదివాడు. మద్రాసులో పని చేస్తున్నాడు. ఎంతమందిని చూసుంటాడు? ఎంత అనుభవజ్ఞుడయుంటాడు? ఈ రోజు వాడు – 'నీకేం తెలీదు నాన్నా' అంటాడు. 'మీవి వెళ్ళిపోయే రోజులు. మీరు సర్దుకోండి' – అంటాడు. ఒప్పుకోవాలి. మేం పస్తులుంటే వాడికి పది రూపాయిలు మిగులుతాయనుకోవాలి–" అంటూంటే అతని గొంతుక బొంగురుపోయింది.

ఆ మార్పుని పట్టించుకునే మనస్థితిలో లేను. ఆవేశంగా లేచాను. "ఏమిటయ్యా నువ్వుచేసే వితండం – దొంగ వెధవలు – పుట్టి ఒకలా తినేసారు. ఒక్క రోజు సుఖంగా వుండనివ్వలేదు. పెరిగి పెద్దాళ్ళయి యిప్పుడు మరోలా తినేస్తారు. ఉన్నదంతా ఊడిచేస్తారు. చిప్ప చేతికిచ్చి అడుక్కోమంటారు. నీ కొడుకులాంటోడు వచ్చి నీకు నీతులు చెవుతాడు మీకు తెలియదు 'నీ కొడుకు సంగతి –"

ఇంకా ఏంటేంటో అంటున్నాను. తెలుస్తూనే వుంది – ముసిలాడి కంగారు. తన కొడుకు మీద పెట్టి తనేదో అనుకుంటూ ఏదో అన్నాడు. అది నాకు ఇంకోచోట తగిలింది. నా కోపం అర్థంకాక బిత్తరపోయాడు. సోఫాని బల్లిలా కరుచుకునిపోయాడు.

నేను వెంటనే తగ్గిపోయాను. కొద్దిసేపుంటే – 'ఏదో కోపంలో అన్నానయ్యా–" అని సర్దేసేవాడినే – అలా అవలేదు. జానకి వచ్చింది. వస్తూనే – ఆ ముసిలాడి మీద మహంకాళీ అవతారం ఎత్తేసింది.

వాచికం



–బద్దిగం

ఒక నాటక ప్రయోక్త వాచికం గురించి కృష్ణశాస్త్రిగారు ఈ కథ చెప్పేవారు.

పిఠాపురంలో ఒక అమ్మాయి రోజూ సున్నపు గుల్లలు అమ్మేది. సందు చివర వున్నప్పుడు 'సున్నపు' గుల్లలూ, 'సున్నపు' గుల్లలూ' అని స్పష్టంగా అనేది. అలా అరుచుకుంటూ నడుచుకుంటూ కొంతదూరం వెళ్లేటప్పటికి ఆ పదం అపభ్రంశం అయ్యేది. 'అలా వుంది మన వాడి వాచికం' అనేవారు శాస్త్రిగారు.

"అసలే – ఆయన జబ్బు మనిషి. ఎందుకలా – సందు దొరికింది గదా అని – మీద పడడం? నీ కొడుకు నిన్ను చూడకపోతే – ఆయనేం చేస్తాడూ – నిన్ను పల్లకీలో పెట్టి ఊరేగించాలా? –" జానకి ఈ ధోరణిలో దులిపేస్తుంటే – ఆశ్చర్యం – నేనేగాదు – ఒక్కముక్క అనలేదు ఆ పెద్దమనిషి! నాకన్నా వయసున పెద్దవాడు! కోపం రాదా? కోపం ఆఫీసర్లకీ, మాజీ ఆఫీసర్లకేగాని – చౌకీదార్లకి మాజీలయినా రాదా?

ముసిలాయన వంచిన బుర్ర ఎత్తలేదు.

మనసంతా ఆదోలా అయిపోయింది. "– ఇహ వెళ్ళు జానకీ–" అన్నాను వచ్చజెపుతున్నట్టుగా. జానకి ఏ కళనున్నదో – ఏమీ మాట్లాడకుండా వెళ్ళిపోయింది.

అతను తల ఎత్తలేదు.

మనసంతా కోరేస్తున్నట్టయింది. జీవితంలో ఎన్నోమార్లు ఎందరినో ఇంతకి మించే అన్నాను. ఎందరో నోరెత్తకుండా పడ్డారు. తప్పు వారిదయినపుడూ – అయినా, కాకపోయినా అనే అధికారం నాకున్నపుడు – ఎదుటివాడు పడాలనే నేను అనుకున్నాను.

కాని – ఆ క్షణంలో... అలా అనిపించడం లేదు. అలవాటు లేని జోపానలాగ – ఆ సందర్భాన్ని నిర్వహించటమెలాగో మనసు తన్నుకొంటోంది –

"వెళ్ళొస్తాను – బాబుగారూ –" తన కూరల సంచీ తీసుకుని వెళ్ళిపోయాడు. అతను వెళ్ళిపోగానే – లోపలి నుంచి జామ్మంటూ వచ్చింది జానకి.

"మీ రెప్పుడు తెలివిగా ఏడిసారూ? అవసరాలలో వున్న వెధవలను చేరదీయకండి – అంటే – విన్నారా? వెంటబడి సతాయించేస్తున్నాడు. ఇంతకీ ఆ కొడుకు వెధవకి ఏమయినా వుందో – లేదో వీడికి మేపటానికి? కాస్త నదురుగా కనిపిస్తూంటే – పది రూపాయిలు ఇవ్వకపోతారా అని వెంటబడుతున్నాడు. ఈ వయసులో ఇంత వండి పడేస్తూంటే తినేసి పడుంటారు – ఎవరయినా? కొడుకుతో పడదు – పెళ్ళాంతో పడదు – అక్కర్లేని తద్దినాలు–"

నాకు ఒళ్ళంతా చితకగొట్టినట్లుంది. జానకి మాటలు వినిపిస్తున్నాయి. ఎక్కడికయినా పోవాలనిపిస్తోంది. ఎక్కడికి? ప్రపంచం చిన్నది కాదు. జానకి కనబడటం లేదు. ఆ ముసలి రామనాథం కనిపిస్తున్నాడు. అతని మాటలు వినిపిస్తున్నాయి.

చెప్పలు వేసుకుంటున్నాను – బయటకి పోవడానికి.

"–ముద్ద ఉడకేసి పడేసాను. మింగిపొండి. ఊరి మీద బలాదూరు తిరిగి ఎప్పుడో చక్కా వస్తే అప్పుడు వడ్డించడానికి నాకు ఓపిక లేదు" జానకి అడ్డేసింది.

స్నానం చేసి, పూజ పూర్తిచేసుకుని, మడిపంచెతో వచ్చి కూర్చుని గబగబా నాలుగు మెతుకులు కతికాను.

అయినా – మనసు తినేస్తూనే వుంది. ముసిలాయన మాటలూ, నేనంటూంటే – జానకి తిడుతూంటే – ఆయన మొహమూ గుర్తు వస్తున్నాయి.

బయటకి వచ్చాను. ఎండ పేల్చేస్తోంది.

రోజురోజుకీ ఓపిక తగ్గిపోతోంది. నాలుగడుగులకే – నీరసం. తప్పదు. ఈ నరకంలోంచి బయటపడాలి.

నడుస్తున్నాను.

మనుషులు. మనుషులు. ఎదురుగా మనుషులు. పక్క నుంచి మనుషులు. దగ్గర దగ్గరగా మనుషులు. నేను పట్టించుకోని మనుషులు. నన్ను పట్టించుకోని మనుషులు. ఇంతమంది ఉన్నా అందరూ నాకు ఎంత దూరం! ఎంత ఒంటి మనిషిని నేను!!

భూమ్మీద ఒకప్పుడు చాలా తక్కువ మనుషులుండేవారు. ఒక గుంపుకీ – మరో గుంపుకీ దూరం వుండేదికాని... మనిషికీ మనిషికీ మధ్య దూరం వుండేది కాదు. గుంపూ, మనిషీ ఒకటే! నాలాంటి వాళ్ళుండే అవకాశమే లేదు. పుట్టుక నుంచీ... మరణం వరకూ... మనిషి తోటివాళ్ళతో కలిసే వుండేవాడు. పుట్టుకతోనే నాతోటివాళ్ళు అందరితోనూ విడిపోయారా? అందుకేనా... కుటుంబంతో కూడా నేను కలియలేకపోయాను? అందుకేనా... కలిసుండే కుటుంబం నిర్మించుకోలేకపోయాను? అందుకేనా... రవి అలా తయారయాడా?

లలిత గుడి మంటపంలో కూర్చున్నాను.

ఆ మానవుడిని అలా అవడానికి కారణమైన కాగితం ముక్క నా జేబులో వుంది – దాన్ని తీసాను.

"– వారం అవకుండా ఒకదాని వెనక ఒకటిగా మీరు రాసిన మూడుత్తరాలూ అందాయి. రామ రామా మీకు మతిపోతోంది. ఎవరో ముక్కూ మొహం తెలియని మనిషి దగ్గరకు నేను వెళ్ళాలి. నీ బాబుని నువ్వు సరిగా చూడడం లేదేమయ్యా అని

అడగాలి. అదీ మీ ఆజ్ఞ. ఆయన నన్ను చెప్పచ్చుకు కొడతాడు. మర్యాదస్తుడయితే – పిచ్చాసుపత్రికి పంపిస్తాడు. మీ వ్యవహారం అంతా అమ్మ రాస్తూనే వుంది. మింగ మెతుకు లేకపోయినా, మీసాలకు సంపెంగ నూనె రాస్తున్నానని – అంటున్నారుట. అవును నాన్నగారూ – కాన్వెంటు చదువులూ, స్కూటరూ, కలర్ టీ.వీ., ఫ్రిజ్జూ, ప్రతిదీ మీకు కన్నెర్రే! అవన్నీ ఎంత అవసరమో – ఇక్కడకు వచ్చి చూడండి. మా క్వార్టర్స్‌లో నా కన్నా రెండూ, మూడూ తక్కువ పొజిషన్లల్లో వున్నవాళ్ళు ఇంతకన్నా ఎక్కువ కొనుక్కుంటున్నారు – మీరు మీ రోజుల్లో నీతులకి పోయి నాలుగు రాళ్ళు వేసుకోలేదు. ఇప్పుడు నాకు వేసుకోవాలన్నా ప్రతి వెధవా అడ్డే! కిట్టుబాటయినా పనికి వాళ్ళు పోతారు. కనీసం హోటలుకి కూడా తీసుకెళ్ళి భోజనం పెట్టని పని నాకు వదిలేస్తారు. నేనిలా బాధపడుతూంటే – మీరు జల్సా చేస్తారు. మీ సాహసాలకు, సరదాలకు డబ్బులు నేను పంపాలి. రిటైరయాక వచ్చినదంతా నా చేతిలో పోసానని – అమ్మని తిడుతున్నారుట. మీ సొమ్మొకటీ, నా సొమ్మొకటీ అని నేను అనుకోలేదు. పిల్లల కోసం తల్లిదండ్రులు త్యాగం చెయ్యడమన్నది సృష్టిధర్మం. ఇక్కడ ఈ ప్లాట్ కొని, ఇల్లు కడుతున్నానంటే నా పిల్లల కోసం కాదా? మీ చేత ఇన్ని మాటలు పడుతున్నానంటే వాళ్ళ కోసం కాదా? మీలాంటి కర్కోటకులు ఎక్కడా వుండరు. నాకూ పౌరుషం వుంది. ఈ ప్లాటూ, కడుతూన్న ఇల్లూ అమ్మేసి రేపే మీ సొమ్ము మీకు ఊడి కట్టేస్తాను. పంపమని రాయండి. ఎంత పంపాలో రాయండి. వడ్డీ మరిచిపోకండి –"

రవిగాడి ఆ ఉత్తరం వచ్చినవెంటనే ఓ కార్డుముక్క బరికేసాను – "చాలా సంతోషంరా అబ్బాయీ – నువ్వు నాకు ఎంత యివ్వాలనుకుంటున్నావో అంతా వెంటనే పంపెయ్ – వడ్డీ మరిచిపోకు – నిన్ను కన్ననాటి నుంచి పెట్టిన ఖర్చు అంతా పంపెయ్–"

ఆ ఉత్తరం చూసి జానకి ముక్కలు ముక్కలుగా చించేసింది. "రామరామ మతిపోతోంది – మీకు! ఇదంతా వాడికి పెట్టకపోతే – కట్టుకుపోతారా – ఈ రోజు వాడి నుంచి వసూలు చేస్తారు – ఒంట్లో ఓపికుంది. ఉన్నాను గదా – పెళ్ళాం సేనుగని. చేయించుకుంటారు. రేపొద్దుట – కన్నొంగుతుంది. కాలొంగుతుంది. అప్పుడయినా వాడి మీద ఆధారపడరా? – పడరు. వున్నాను గదా! చేస్తాను. చేయించుకుని పోతారు. నా గతి? ఈవాళ మీరు ఇచ్చారన్న విశ్వాసంతోనయినా రేపు చూస్తాడు –" అంది జానకి.

నా చావు తర్వాత తన బతుకు కోసం తన తెలివితోనో, తెలివితక్కువతోనో ప్రణాళికలు వేస్తోంది జానకి.

అంతా అన్న బుద్ధులు

'ఏమండీ వండక్కి, మనింటకొచ్చిన మీ తమ్ముడు వెళ్ళేటప్పుడు మన టవల్ తీసుకెళ్ళాడు?' ఫిర్యాదుగా అంది శ్రావణి తన భర్తతో.

'కొందరు వెధవలంతే. ఇంతకీ వాడు తీసుకెళ్ళింది కొత్త టవలా? పాత టవలా?' అనుమానంగా అడిగాడు భర్త.

'మొన్నీ మధ్య మనం మా అన్నయ్యగారింటికి డిన్నర్ కెళ్ళినప్పుడు పొరపాటున తీసుకొచ్చిన టవల్' అంది శ్రావణి సిగ్గుపడుతూ.

–కాట్రగడ్డ



నేను? దాని రాద్ధాంతాన్ని ఎందుకు భరిస్తున్నాను? ఏ రాత్రివేళయినా... కబుర్లు చెపుతుందని! ఏ నొప్పయిన్నా వస్తే వంటి మీద చెయ్యి వేస్తుందని! వేళకి – ఏదో ఒకటి వండి పడేస్తుందని!

ఇవన్నీ సౌకర్యాలా? అవసరాలా?

మనిషి – మనిషికీ మధ్య వున్నదేమిటి? ఉండవలసినదేమిటి?

ఆ రామనాథంతో నేను ఎందుకలా వున్నానో నాకు తెలుసు.

అలా వుండకూడదు. ఎలా వుండాలో తెలుసు.

ఉండగలనా?

రవినీ – జానకినీ – పోగొట్టుకున్నానా? పోయారా?

లోకంలో ఎందరు రామనాథాలు! ఎందరు జానకిలు! అందరికీ ఒకటే లక్ష్యం. చచ్చేదాకా బతకాలి. అనాథ చావు చావకూడదు. ముదిమిలో డబ్బు ఒక్కటే సరిపోదు. మనిషి కావాలి. మాట కావాలి. జీవితం అంతా పోగొట్టుకున్న మనిషి... మాటా... దొరకడం జరుగుతుందా?

గుడినించి బయటకు వచ్చాను.

రామనాథం యింటికి రిక్షా ఎక్కాను. రానిస్తాడా? చౌకీదారు రామనాథం అధికారి రామనాథాన్ని అవమానిస్తాడా? నేననలేదా – అతనూ అనవచ్చు. అతను పడలేదా – నేనూ పడతాను.

సందులోంచి వెనక తట్టున వున్న ఇంటికి చేరేసరికి కన్నులపండుగలాంటి దృశ్యం.

దంపతులు ఇద్దరూ పాత కాగితాలతో సంచీలు చేస్తున్నారు. ఆవిడ పకపకా నవ్వుతోంది. అతను నెమ్మదిగా నవ్వుతున్నాడు. అది నేను పోగొట్టుకున్నది. ఆ దృశ్యం చెదిరిపోకుండా అలాగే చూస్తూ నించుండిపోయాను. ముందుగా ముసలావిడే చూసింది. అంత మనిషీ సిగ్గుపడిపోతూ – "రండి బాబుగారూ" అంటూ లేచి నించుంది.

దంపతుల మొహాల మీద ఎంత వెతికినా, నా మీద ఎలాంటి కోప చిహ్నమూ కనపడలేదు. లోపల్లోపల వున్నా – నా బోటివాడు – రావడమే వాళ్ళకు నా క్షమార్పణలా అనిపించిందా?

చివరికి నెమ్మదిగా నోరు విప్పి – రవి విషయం చెప్పాను. మనసులో వున్న బాధనూ, ప్రశ్నలనూ బయటపెట్టాను. అతనికి ఎలా అర్థమయిందో మరి – అన్నాడూ –

"– బాబుగారూ – చిన్నవాణ్ణి – తెలిసీ తెలియకా ఒక్క మాట చెపుతాను. నాకూ బాధగానే వుంటుంది. బాధలు పడుతున్నట్టే వుంటుంది. కానీ – ఈరోజుల్లో ఎవరు సుఖపడుతున్నారు–? నామట్టుకునాకు – ఆడవాళ్ళు – పిల్లలు – పెద్దాళ్ళు – వయసులోవాళ్ళు – చదువుకున్నాళ్ళు – చదువు లేనాళ్ళు – ముసిలాళ్ళు – అందరూ బాధలు పడుతూనే వున్నారు. ఎందుకు పడుతున్నారు? అందరిదీ తలోరకం.

ఇవ్వన్నీ ఇప్పుడే పుట్టుకొచ్చాయా – పూర్వం లేవా? అవి మరో రకం.

చిన్నవాళ్ళు పెద్దాళ్ళ మాట వింటే మనకీ బాధ వుండదనుకుంటాం? అది నిజమేనా?

బాబుగారూ – మా తాతా, మా నాన్నా ఒకే వూళ్ళో వుండేవారు. మా తాత ముసిలాడయ్యేదాకా మా నాన్న ఆయన చాటున వుండేవాడు. మాట జవదాటేవాడు కాదు. మా చిన్నాన్న అలా కాదు. తన వాటా ఇమ్మని పంచాయితీ పెట్టించాడు. వాటాలు వేసుకున్నారు. తన వాటా భూమినీ, ఇంటినీ అమ్మేసాడు. ఈ ఊరు వచ్చాడు. అందరూ ఆయనని దుర్మార్గుడన్నారు. తండ్రిమాట విన్నందుకు మా నాన్నని రామచంద్రుడన్నారు. మా తాత ఏం చెప్పేవాడో – ఏం చేసేవాడో! ఆయన పోయే వరకూ ఇంట్లో ఎప్పుడూ పండగలా వుండేది. ఆయన పోయాడు. ఆ రోజుల్లో మా చిన్నాన్న వచ్చి ఓ రోజున నన్ను పొలంలోకి తీసుకుపోయాడు–

"అబ్బాయ్ రామూ – మీ నాన్న వినటం లేదు. నువ్వయినా విను. మీ కున్న ఆస్తికీ, అప్పుకీ సరిపోయేలా వుంది. ఈ ఇంటినీ అన్నింటినీ తెగనమ్మెయ్యి. విశాఖపట్నంలో బతకడానికి వందా తొంభై మార్గాలున్నాయి. నువ్వు కనీసం అక్షరం ముక్క నేర్వలేదు. నువ్వు నేర్చిన మంత్రాలతో చింతకాయలు రాలవు. మించిపోలేదు. నీకింకా పదహారేళ్ళు. ఏదోలా చదువుకోవచ్చు – మీ నాన్న గట్టిగా మాట్లాడితే నీ మాటయినా వింటాడురా–" అన్నాడు.

నేను మా చిన్నాన్న మాట వినలేదు. మరో పన్నెండేళ్ళకి మా నాన్న పోయాడు. మా తాతలా రాజాలా బ్రతుకుదామనుకున్నాడు నాన్న. చివరికి అప్పు ఆస్తిని మించిపోయింది. నన్నూ రామచంద్రుడన్నారు. ఏం లాభం? ముగ్గురు పిల్లలతో, కట్టుగుడ్డలతో నిలబడ్డాను. చిన్నాన్నే ఆదరించాడు. ఇక్కడ చౌకీదారు పని ఇప్పించాడు. ఆయన వున్నంతకాలమూ

మాట సాయం అయాడు, నా కూతుళ్ళకు పెళ్ళిళ్ళు జరిపించాడు. నా కొడుకుకి చదువు అబ్బింది. రాణించాడు.

బాబుగారూ – నేనూ మా నాన్నా మా మంచి మేం చూసుకోలేదు. నా కొడుకు వాడి మంచి వాడు చూసుకొంటున్నపుడు – నేనెలా తప్పబట్టగలను? నిజమే – ఏవో బాధలున్నాయి నాకు. ముసలితనం ఎలాగా అని బెంగే! – కానీ ఇదంతా మావాడి చెడ్డతనమేనా? ఎన్నెన్ని సరదాలు – సౌకర్యాలు – అందుబాటులో వున్నాయి. అవి అమర్చుకోడానికి – ఎంత నలిగిపోతున్నారు! మన కంటికి – అవి కొనితెచ్చుకున్న బాధలే – లేనిపోని పరుగులే – ! మనలాంటివాళ్ళవే నిజమైన బాధలు అందాం –! ఈ ముసలితనం బెంగలు మా తాతకి లేవు. ఎందుకని? ఆయనకి అధికారమూ, పెత్తనమూ వున్నాయి గనక. తన కొడుక్కి లోకం తెలియదు గనక. అవునంటారా – కాదంటారా?"

రామనాథం మాట్లాడినది శ్రద్ధగా విన్నాను. ఏం అనాలో తోచలేదు. మళ్ళీ ఆయనే అన్నాడు – "బాబుగారూ – కాలం మారింది – మంచీ, చెడ్డా, ధర్మం, అధర్మం అన్నీ మారుతున్నాయి. శ్రీరామచంద్రుడు తన తండ్రి మాట పాటించడమేనా? తండ్రి – రాముడి మంచీ, చెడ్డా చూడనక్కరలేదా – అన్న ప్రశ్న వస్తోంది. అందువల్ల – మనమూ మారడమే – నలుగురితోబాటే మనమూ అనుకోడమే–"

ఆయన ఏం తేల్చాడో బోధపడలేదు. నా కొడుకుని సమర్థిస్తూన్నట్లే అనిపించింది. అది మనసుకి సహించు కాలేదు.

"రోజులు మారుతున్నాయి గదా – అని – తలిదండ్రులు అన్నీ తమ పిల్లలకి అప్పజెప్పేసి – ఏమందో, మాకో మింగి చావాలంటారు–"

రామనాథం ఆలోచనలో పడ్డాడు. అతని భార్య అంది – "ఆయన ఉద్దేశం అదే బాబుగారూ–"

ఆవిడ సన్నగా నవ్వుతూనే అన్నప్పటికీ, ఆ గొంతులో భర్త మీద ఫిర్యాదు వుంది.

అయితే – వాళ్ళిద్దరి మధ్యా మాట తేడా వుందన్నమాట! చూడడానికి మెత్తగానే వుంటాడుగాని – పెళ్ళాన్ని బాగానే వంచుతాడన్నమాట!

"మీ ఆయనకి మీ ఉద్దేశం చెప్పారా?" అన్నాను.

"ఎందుకు చెప్పను! ఏవో అచ్చికాలూ, బుచ్చికాలూ చెప్పి తన మాటే నెగ్గించుకుంటారు – ఈయన. నా కోడలుకి కూడా నేను చెప్పినది ఆ రోజు ఎక్కలేదు. ఈ రోజు బాధపడుతోంది–" అంది.

"ఏం జరిగిందమ్మా –" కుతూహలంగా అడిగాను.

ఆవిడ మాట్లాడలేదు. రామనాథం మొహం కూడా ఇబ్బందిగా వుంది. నేను అలా అడగడం పొరపాటా?–

◆ పెళ్ళి ◆

"వంద మందిని హత్య చేసిన రాజా
తోట నీ చెల్లికి పెళ్ళెందుకు చేశావు?"
కోపంగా అడిగాడు వంశీ.
"అతడు హత్య చేసిన వారంతా
నాకు అప్పిచ్చినవారే. అందుకని"
అసలు విషయం చెప్పాడు మురళి.

–పి.ఎస్.కుమార్

రామనాథం ఏమనుకున్నాడో – సన్నగా నిట్టూర్చి – అన్నాడు.

"మీకు చెప్పకూడదని ఏమీ లేదు బాబుగారూ – ఏం చెపుతుంది తను? కూచున్న కొమ్మను నరుక్కోవద్దంటుంది. మావాడు – నా రిటైర్మెంట్ డబ్బుని – ఇళ్ళ జాగాల మీద పెడతానన్నాడు. ఏడాది తిరిగేసరికి రెట్టింపు అవుతుందన్నాడు. ఈవిడ వద్దని సలహా ఇచ్చింది. తప్పదంటే – ఆ కాగితాన్ని నా పేర రాయించుకో – అంది. పోనిస్తూ – ఎప్పటికైనా వాడిదే గదా – అన్నాను. అదీ నా పొరబాటు –" అతను తన పొరపాటును ఒప్పకోవడంలో నిజాయితీ వుంది. నిష్టూరం లేదు.

"పోన్లెండి – బాధపడకండి. మనవి అయిపోయి రోజులు. ఓపికున్నంత కాలం – ఇలా – ఏదో చేసుకుంటాం – గడచిపోతుంది. ఆ పిల్ల బ్రతుకేమవుతుంది–? అదీ బాధపడాలి – " అంది.

"బాధపడకండి – మొగుడూ, పెళ్ళాం కలిసుంటే చాలు – అన్నీ అవే సర్దుకుంటాయి–" అన్నాను.

"అలా అయితే అంతకన్నా ఈ ముసలితనంలో కావలసిందేంటి? మా కోడలు రాసినది నిజమే అయుంటుంది! దాన్ని పెళ్ళాడే ముందు – దానికి ఎంత జీతం వస్తుందో – ఏం చెయ్యొచ్చో – మావాడు లెక్కలు పెడుతున్నపుడే – నాకు మతిపోయేది. ఏడి కడుపులో ఇన్నిన్ని ఆలోచనలా – అనుకునేదాన్ని. ఈ రోజుల్లో పిల్లలందరూ ఇలాగే వుంటున్నారు – అనేవారు ఈయన. వాడి లెక్కలూ గట్రా గుర్తుకొచ్చే– నా కోడలుని వెళ్ళవద్దన్నాను ఆ రోజున. ఈ రోజు వాడు ఎవరో పిల్ల వెనకాల – వాళ్ళ ఆఫీసులో చేస్తోందిట – తిరుగుతున్నాడని రాసింది కోడలు. పిల్లలతో ఇక్కడికి వచ్చేస్తానంటోంది. నా ఒంట్లో రెక్కలున్నాయి. వచ్చెయ్యమంటాడు ఈయన – ఆ గుంజాటనలో వున్నాం –" అంటూ ఆగింది.

విషయం కొంత అర్థం అయింది. సంపాదన కోసం ఒకరిని పెళ్ళాడాడు. అది పోతే – మరో సంపాదన కోసం వలేస్తున్నాడన్న మాట – ఘటికుడే!

"ఏం చేస్తాం – మన ఖర్మా – దాని ఖర్మానూ! లోకంలో ఎక్కడో మాటికీ కోటికీ ఒకడుంటాడు – వాడు మన కొడుకయాడు – దానికి మొగుడయాడు–" అన్నాడు రామనాథం నిస్పృత్తువగా గోడకి జారబడి.

"బాబుగారూ – మీరే చెప్పండి – ఈ రోజున, లోకంలో ఎన్ని వినడం లేదూ! మనుషులు ఇంతింత దుర్మార్గాలు ఎలా చేస్తున్నారు? దైవభయం వుండేది. లోకభయం వుండేది. అద్దూ, అదుపూ వుండేవి. ఎవడికయినా మంచి బుద్ధి పుడితే ఫరవాలేదు. లేకపోతే –? అందుకే – పెళ్ళామవనీ, మొగుడే అవనీ, తల్లీదండ్రీ అవనీ, ఎవరయినా సరే – తమ మంచీచెడ్డా తాము చూసుకోవాలి. ఆధారపడ్డావా – అడుక్కుతిన్నట్టే – ఇవ్వడు ఖర్మ అనుకుంటే ఏమవుతుంది?" ఖరాఖండీగా చెప్పింది.

"ఏమనుకోకండి బాబుగారూ – ఏదో మా బాధలో వున్నాం–" అంది.

"ఫరవాలేదమ్మా – ఇవన్నీ అందరి బాధలూనూ –" అని – "ఒక్క చిన్న అనుమానం –" అంటూ ఆగాను.

"అడగండి బాబుగారూ–"

"ఆధారపడటం మంచిది కాదని మీకు ... ఎందుకనిపించిందమ్మా–"

"ఇందులో ఏముంది బాబుగారూ – ఆడదాన్ని. మొగుడూ, పిల్లలూ, అత్తామామా అందరికీ ఆధారంగా బ్రతికాను. చాకిరీ చేస్తుంటే నా మీద ఎవరెంత ఆధారపడుతున్నారో – తెలియదా? అందుకే – ఆడది చచ్చేదాకా ఎవరి మీదా ఆధారపడకుండా బ్రతకడమే మంచిదనుకుంటుంది–"

ఆశ్చర్యపోయాను – ఆడాళ్ళంతా మగాళ్ళ మీద ఆధారపడతారని గదా – విన్నాను. ఈవిడేంటి – లోకవిరుద్ధంగా మాట్లాడుతుంది! సంసారానికంతకీ తనే ఆధారం అంటుంది!

నాకా మాట మింగుడుపడలేదు.

కొంచెంసేపు వుండి – బయల్దేరాను. ఇంటికి చేరాను. మింగుడుపడని ఆ మాట నన్ను వదలలేదు.

భోంచేసాను. లైటు తీసేసి నిద్రపోబోయాను. పట్టలేదు.

ఆవిడ అన్నది నిజమేనేమో! ఎవరి చేత చాకిరీ చేయించుకుంటారో – ఎవరి మీద పని కోసం ఆధారపడతారో – వాళ్ళనే – మసిపూసి, మారేడుకాయ చేసి – తమ మీద ఆధారపడ్డట్టుగా – తాము వాళ్ళని దయదలుస్తున్నట్టుగా – నమ్మించడంలోనే జగత్తంత్రం వున్నట్టుంది!

ఆ ఊహను నాలోని మాజీ అధికారి చాలాసేపు అంగీకరించలేదు.